దిన పత్రిక తొలి సమయం

శనివారం , 21 - 2 -2026

# సీపీఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ పార్టీలోకి చేరిక

### - రాష్ట్ర నాయకులు గోపన్న చేతుల మీదుగా కండువాలు




**తొలి సమయం కొత్తగూడ 20 ఫిబ్రవరి 2026**

ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే శక్తి తమ పార్టీదేనని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని () న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కా. గోపన్నఅన్నారు. ప్రజా హక్కుల సాధనలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తగూడ మండలం వేలుబెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ తదితర పార్టీలకు చెందిన సుమారు 10 కుటుంబాల కార్యకర్తలు ఆయా పార్టీలకు రాజీనామా చేసి సీపీఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కొనకటి సూరయ్య, కట్ట లక్ష్మయ్య, సింగరబోయిన మల్లయ్య, దొంగల చినమల్లయ్య, భూక్యా వీరన్న, దొంగల ఎలందర్ తదితరులు ఉన్నారు. కా. గోపన్న పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా చేరిన నాయకులు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి గ్రామంలో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు కా. సిద్ధబోయిన జీవన్, కా. వళ్ళపు సాంబరాజు, కసార్ల లక్ష్మయ్య, ఐ.టి. శ్రీరాములు, కోనకటి కొమరయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడలో టమాట రైతుల ఆవేదన

### - ధరలు పతనం పెట్టుబడి కూడా రాక ఉచితంగా పంపిణీ

**తొలి సమయం కొత్తగూడ 20 ఫిబ్రవరి 2026**

కొత్తగూడ మండల కేంద్రంలో శుక్రవారం విషాదకర పరిస్థితి నెలకొంది. వారాంతపు సంత సందర్భంగా టమాట రైతులు భారీగా పంటను మార్కెట్‌కు తరలించారు. మంచి ధరలు వస్తాయనే ఆశతో తెల్లవారుజాము నుంచే వాహనాల్లో టమాటాలను తీసుకువచ్చిన రైతులకు నిరాశే ఎదురైంది. మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో గిరాకీ లేకపోవడం, వ్యాపారులు చెప్పిన ధరలు దారుణంగా పడిపోవడం వల్ల రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆర్థికంగా కుంగిపోయారు. ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులు, రవాణా వ్యయాలుమొత్తం కలిపి భారీగా ఖర్చయినప్పటికీ, మార్కెట్‌లో వచ్చిన ధరలు వాటిని కూడా భర్తీ చేయలేని స్థాయిలో ఉండటం రైతుల ఆందోళనకు కారణమైంది. పంటను తిరిగి గ్రామాలకు తీసుకెళ్లడం కూడా రవాణా వ్యయభారం పెంచుతుందని భావించిన కొందరు రైతులు చివరకు టమాటాలను ఉచితంగా ప్రజలకు పంపిణీ చేయాల్సి వచ్చింది. "ఫ్రీ ఫ్రీ టమాటాలు ఫ్రీ" అంటూ రైతులు పిలుపునివ్వడంతో స్థానికులు టమాటాల కోసం ఎగబడ్డారు. కొందరు బస్తాలు, సంచులు తీసుకువచ్చి టమాటాలను తీసుకెళ్లిన దృశ్యాలు మార్కెట్‌లో కనిపించాయి. రైతుల ఈ



పరిస్థితి స్థానికులను కదిలించింది. ప్రభుత్వం మార్కెట్ స్థిరీకరణ చర్యలు తీసుకుని కనీస మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. పంట పండించిన రైతుకు న్యాయమైన ధర అందేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. టమాట రైతుల ఈ ఆవేదనాత్మక సంఘటన మరోసారి వ్యవసాయ రంగంలోని అస్థిర పరిస్థితులను వెలుగులోకి తీసుకొచ్చింది. రైతుకు రక్షణ కల్పించే విధానాలు లేకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.